క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు: మండలంలో ఆర్‌డీఎస్‌ఎస్ పనులు చేస్తున్న నేపథ్యంలో ఆదివారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పొట్టిపల్లె, అక్కపల్లె, గోవిందపల్లె, కంకరవానిపల్లె గ్రామాల్లో ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలన్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నదానం


భోజనాలు వడ్డిస్తున్న ఉభయదాతలు

పొదిలి: స్థానిక శ్రావణి ఎస్టేట్‌లోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రతి శనివారం అన్నదానం జరుగుతుంది. ఈ క్రమంలో శనివారం గొంట్లా రామచంద్రరావు(రాము), నాగమణి దంపతులు, దేవరపల్లి రమణారెడ్డి, వెంకట నరసమ్మ ఉభయదాతలుగా వ్యవహరించి కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఉభయదాతలు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు యక్కలి శేషగిరిరావు, శ్రావణి వెంకటేశ్వర్లు, ఓబులశెట్టి నరేంద్ర, సాయి పాల్గొన్నారు.


బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు


బస్టాండ్ ప్రాంగణంలో అడ్డదిడ్డంగా ఉన్న ఆటోలు

బస్సుల్లేక ప్రయాణికుల అవస్థలు

- బస్టాండ్‌లోనే తిష్టవేసిన ఆటో డ్రైవర్లు
- దసరాకు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు
- ఆర్టీసీ డీఎం నరసింహులు


బస్సు ఎక్కేందుకు తిప్పలు పడుతున్న ప్రయాణికులు

మార్కాపురం: దసరా పండగతో పాటు శనివారం నుంచి కళాశాలలకు సెలవులు ఇవ్వడంతో ఒక్కసారిగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం ప్రయాణికులతో నిండిపోయింది. సకాలంలో బస్టాండ్‌లో బస్సులు లేకపోవడంతో మహిళలు వేచి ఉండాల్సి వచ్చింది. ప్రయాణికులు కూర్చునేందుకు వేసిన బెంచీలు కూడా నిండిపోయాయి. బస్టాండ్ ఉదయం 10 గంటల నుంచే ప్రయాణికులతో నిండిపోయింది. త్రిపురాంతకం, శ్రీశైలం, విజయవాడ వెళ్లేందుకు ప్రయాణికులు వచ్చారు. సరిపడా బస్సులు లేకపోవడం, వచ్చిన బస్సుల్లో మహిళా ప్రయాణికులు ఎక్కి కూర్చోవడంతో బస్సు నిండిపోవడంతో మరో గంట సేపు వరకూ ప్రాంగణంలోనే పలువురు నిలబడాల్సి వచ్చింది. దీంతో పాటు స్కూల్స్‌కు సెలవులు ఇవ్వడంతో పలువురు ఒంగోలు, గుంటూరు, కర్నూలు తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు బస్సుల కోసం బస్టాండ్‌కు వచ్చారు. వీరందరి రాకతో బస్టాండ్ కిటకిటలాడింది.

బస్టాండ్‌లో ఆటో డ్రైవర్ల తిష్ట

ఒంగోలు, విజయవాడ, గుంటూరుకు వెళ్లేందుకు బస్సు రాగానే ప్రయాణికులు సీట్లు వేసుకునేందుకు హడావుడిగా వచ్చేందుకు ప్రయత్నించగా సరిగ్గా అదే సమయానికి ఆటో డ్రైవర్లు బస్సు డోర్ వద్దకు వచ్చి బాడుగల కోసం ఆటోలను నిలబెట్టడంతో పలువురు బస్సు ఎక్కేందుకు ఇబ్బందులు పడ్డారు. ఒకవైపు సీటు కోసం పోరాటం..మరో వైపు ఆటో డ్రైవర్లతో గొడవతో ఆ ప్రాంతమంతా గందరగోళంగా మారింది. బస్టాండ్‌ల్లో ప్రైవేటు వాహనాలు తీసుకు రావద్దనే నిబంధనలు పాటించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

బహిరంగ ధూమపానంతో అవస్థలు

ప్రభుత్వం బహిరంగ ధూమపానం నిషేధించింది. ఎవరైనా సిగరెట్, బీడీ, చుట్ట బహిరంగంగా తాగితే రూ.500 వరకూ జరిమానా వేయవచ్చు. మార్కాపురం బస్టాండ్‌లో ఏకంగా సిగిరెట్ కాల్చుకునేందుకు షాపు యజమానులు ఏర్పాటు చేయడం విమర్శలకు తావిచ్చింది. శనివారం అధిక సంఖ్యలో ప్రయాణికులు బస్టాండ్‌లో వెయిట్ చేస్తుండగా పలువురు పొగరాయళ్లు గుప్పుగుప్పు మంటూ వదిలిన పొగతో అక్కడ కూర్చున్న పలువురు ఇబ్బంది పడ్డారు.

ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు

మార్కాపురం ఆర్టీసీ డిపో నుంచి ప్రయాణికుల కోసం విజయవాడ, శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నాం. ప్రస్తుతం సెలవులు కావడంతో పాఠశాలలకు పంపించే బస్సులను కూడా ఒంగోలు, కంభం, వై.పాలెం ప్రాంతాలకు నడుపుతున్నాం. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం.

– నరసింహులు, డీఎం, ఆర్టీసీ

మార్కాపురంలో పోలీసుల విస్తృత తనిఖీలు

- పోలీసుల అదుపులో అనుమానితులు


వివరాలు తెలుసుకుంటున్న సీఐ సుబ్బారావు, ఎస్సైలు

మార్కాపురం: పట్టణంలో శుక్రవారం అర్ధరాత్రి, శనివారం ఉదయం పోలీసులు లాడ్జిలు, ఆర్టీసీ బస్టాండు, పట్టణ శివార్లలో విస్తృత తనిఖీలు చేపట్టారు. సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో వాహనాలను కూడా తనిఖీ చేశారు. అర్ధరాత్రి 12 గంటలు దాటిన తర్వాత పట్టణ, రూరల్ ఎస్సైలు సైదుబాబు, అంకమ్మరావు తమ సిబ్బందితో పలు లాడ్జిలకు వెళ్లి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. లాడ్జిలో ఉన్న వారి వివరాలు పరిశీలించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహించగా ఇద్దరు పాత నేరస్తులు అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో వారిని అదుపులో తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. వాహనాల తనిఖీల్లో పలువురికి లైసెన్సు, సీ బుక్, ఇన్సూరెన్స్ వంటివి లేకపోవడంతో ఫైన్ వేశారు.

టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి


టీకాలు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి రవి

బేస్తవారిపేట: పశుపోషకులు టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ రవి అన్నారు. బేస్తవారిపేట మండలంలోని కొత్తపల్లెలో, కొమరోలు మండలంలోని ఎడమకల్లు, రాజుపాలెం, కంభం మండలంలోని కందులాపురం, యర్రబాలెంలో జాతీయ పశు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న గాలికుంటు నివారణ టీకాలు కార్యక్రమాన్ని శనివారం తనిఖీ చేశారు. రైతులు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, అక్టోబర్ 15వ తేదీ వరకు గాలి కుంటు నివారణ టీకాలు వేస్తారన్నారు. కార్యక్రమంలో బేస్తవారిపేట పశుసంవర్ధకశాఖ ఏడీ ఆషా, మండల పశువైద్యాధికారులు ధనుంజయ రెడ్డి, వినోద్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బలిజలపై కూటమి కక్షసాధింపు


ఆర్‌ఐకి వినతి పత్రం అందిస్తున్న బలిజ సంఘం నాయకులు

అర్ధవీడు: బలిజ కులంలో ప్రభుత్వం దొమ్మరి కులస్తులను కలపవద్దని మండల బలిజ సంఘం అధ్యక్షుడు దేవరశెట్టి రఘునాథ్ శనివారం ఆర్‌ఐ శర్మకు వినతి పత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తెచ్చిన జీఓను వెనక్కి తీసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం బలిజ కులస్తులపై కక్ష్య సాధింపు చర్యలు చేస్తోందన్నారు. గత ప్రభుత్వం కాపులకు ఆర్థికంగా ఎదిగేందుకు లోన్లు ఇచ్చి ఆదుకుందన్నారు. కార్యక్రమంలో అయ్యావారిపల్లి సర్పంచి అటకారి వెంకటేశ్వర్లు, శ్రీను, జీ నారాయణ, పీ.సుబ్బయ్య, చిన్న శేషయ్య, రామకృష్ణ, మారబత్తుని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి


వలంటీర్లతో నాబార్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రవికుమార్

బేస్తవారిపేట: ప్రభుత్వ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని నాబార్డ్ జిల్లా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ జే రవికుమార్ అన్నారు. మండలంలోని పీవీ పురంలో హోప్స్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో బేస్తవారిపేట, కొమరోలు మండలాలకు చెందిన 40 మంది మహిళా వలంటీర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయం, తేనెటీగల పెంపకం, పుట్టగొడుగుల పెంపకం, నాటుకోళ్ల పెంపకంపై అవగాహన కల్పించారు. పీఎంఈజీ, ఏపీ ఎస్‌పీఎస్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నేషనల్ ఆగ్రో ఫౌండేషన్ ట్రైనింగ్ కోఆర్డినేటర్ గోపు భూపతిరెడ్డి, హోప్స్ సంస్థ డైరెక్టర్ కే వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మునగసాగుతో మంచి లాభాలు


- డీఆర్‌డీఏ పీడీ నారాయణ


మాట్లాడుతున్న పీడీ నారాయణ

మార్కాపురం: రైతులు మునగపంటను సాగు చేసుకోవడం ద్వారా మంచి లాభాలు పొందవచ్చని డీఆర్‌డీఏ పీడీ టి.నారాయణ రైతులకు సూచించారు. శనివారం పట్టణంలోని డ్వాక్రా బజారులో మునగ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. పొగాకు, ఇతర వాణిజ్య పంటలను సాగు చేసుకుని రైతులు నష్టపోయేబదులు మునగ సాగు చేపడితే ప్రభుత్వం రాయితీ కూడా ఇస్తోందన్నారు. ఎకరాకు రెండేళ్లకు కలిపి 1.60 లక్షల రూపాయలు ఇస్తుందన్నారు. మార్కెట్‌లో మునగ సాగుకు మంచి డిమాండ్ ఉందని, దీనిపై రైతులు అవగాహన పెంచుకుని ఈ ఏడాది నుంచే పొలాల్లో మునగ సాగు చేపట్టాలని, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను ఉపయోగించుకోవాలని సూచించారు. డీపీఎం దానం, ఏపీఎం నారాయణ, ప్లాంటు మేనేజర్ శ్రీనివాస్, ఏపీఎం పిచ్చయ్య, హెచ్‌ఓ రమేష్ పాల్గొన్నారు.

జగన్మోహినీదేవిగా వాసవీమాత


సంతానలక్ష్మి అలంకారంలో రాజ్యలక్ష్మి


అమ్మవారిశాలలో నిర్వహించిన శ్రీనివాస కల్యాణం


అర్ధవీడులో లలితా త్రిపురసుందరీదేవి అలంకరణ

బేస్తవారిపేట: గిద్దలూరు నియోజకవర్గంలో పలు ఆలయాల్లో అమ్మవారిని దసరా శరన్నవరాత్రుల సందర్భంగా శనివారం ప్రత్యేకంగా అలంకరించారు. బేస్తవారిపేటలోని వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారిని జగన్మోహినీదేవిగా, సోమవారిపేటలోని చౌడేశ్వరీదేవిని లలిత త్రిపురసుందరీదేవిగా, కోటసత్యమాంబదేవి ఆలయంలో మీనాక్షీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. త్రిలోక పుణ్యక్షేత్రంలోని రాజరాజేశ్వరీదేవిని, పాపాయిపల్లె, బేస్తవారిపేటలోని పోలేరమ్మ అమ్మవారిని ప్రత్యేక అలంకరించారు.

ఘనంగా లలితా త్రిపుర సుందరీదేవికి పూజలు

అర్ధవీడు: మండల కేంద్రమైన అర్ధవీడులో పోలేరమ్మ మందిరంలో శనివారం అమ్మవారిని ఘనంగా పూలమాలలతో అలంకరించారు. పాపినేనిపల్లి కన్యకాపరమేశ్వరి ఆలయంలో లలితా త్రిపురసుందరి రూపంలో అలంకరించారు. అంకభూపాలెం రామాలయంలో, పోలేరమ్మ మందిరంలో అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించారు.

మీనాక్షి దేవి అలంకరణలో అమ్మవారు

గిద్దలూరు రూరల్: శరన్నవరాత్రుల సందర్భంగా పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో, కాశినాయకుంట ఆలయంలో గాయత్రిమాత ఆలయంలో అమ్మవారు శనివారం మీనాక్షి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రేడియో బావి సమీపంలోని కాశికామాత ఆలయం, నల్లబండ బజారులోని కనకదుర్గమ్మ ఆలయాల్లో అమ్మవారిని లలిత త్రిపురసుందరిదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయాల్లో భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో కలశపూజ, కుంకుమ పూజ చేశారు. షరాబ్ బజారులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. రాచర్ల రోడ్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

గాయత్రిదేవి అలంకరణలో అమ్మవారు

కొమరోలు: మండల కేంద్రమైన కొమరోలులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రుల వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం తెల్లవారుజాము నుంచి దేవాలయంలో వాసవీ మాతకు ప్రత్యేక పూజలు, కుంకుమార్చన, ఉభయాలు చేశారు. వాసవీమాత సాయంత్రం భక్తులకు గాయత్రిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు.


పెదారికట్లలో..


గొట్లగట్టు రామాలయంలో..

సంతాన లక్ష్మిగా రాజ్యలక్ష్మి అమ్మవారు

మార్కాపురం టౌన్: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా పలు దేవాలయాల్లో అమ్మవార్లను శనివారం ప్రత్యేకంగా అలంకరించారు. సంతానలక్ష్మిగా రాజ్యలక్ష్మి అమ్మవారు, రాజరాజేశ్వరీ దేవీగా వాసవీమాతను అలంకరించారు. అమ్మవారిశాలలో నవరాత్రుల్లో భాగంగా శ్రీనివాస కల్యాణం నిర్వహించారు. స్కంద మాతగా జగదాంబ అమ్మవారు, నాగేంద్ర సమేత కనకదుర్గమ్మ ఆలయంలో కాత్యాయనిదేవీగా, అమలక లక్ష్మీనారాయణ స్వామి దేవస్థానంలో అమ్మవారు క్షీరసాగర కన్యగా ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు జయలక్ష్మీమాతతో పాటు వివిధ దేవాలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు. భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. జమ్మనపల్లి సమీపంలో ఉన్న ముద్దసానమ్మ అమ్మవారికి వెండి పుష్పాలతో పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు, దేవదాయశాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పొదిలి: స్థానిక శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం అమ్మవారు శ్రీధనలక్ష్మీ దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదాతలు, పుష్పాలంకరణ వార్షిక ఉభయదాతలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. హోమ పూజలు జరిగాయి. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.


తర్లుపాడు: స్థానిక శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో దేవీశరన్నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం భక్తులకు అమ్మవారు శ్రీ లలితా త్రిపురసుందరిదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధాన అర్చకులు వెంకటరమణాచార్యులు, సాయి మోహన్ అమ్మవారికి విశేష పూజలు చేశారు. దేవస్థానం ఫౌండర్ ట్రస్టీ విజయ భాస్కరరావు, ఈఓ చెన్నకేశవరెడ్డి, ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు.

కొనకనమిట్ల: దసరా మహోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని గొట్లగట్టు, పెదారికట్ల, కొనమిట్ల, రేగడపల్లి గ్రామాల్లో శ్రీవాసవీకన్యకా పరమేశ్వరి దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలు అత్యంత వేడుకగా నిర్వహిస్తున్నారు. శనివారం శ్రీమహాలక్ష్మీదేవిగా అలంకరించి విశేష పూజలు చేశారు. ఆయా ఆలయాల్లో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఉభయదాతలు పాల్గొని అమ్మవారికి పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పసుపు, కుంకుమ, పండ్లు, పూలు, గాజులు సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు.


బేస్తవారిపేటలో జగన్ మోహినీదేవిగా వాసవీమాత


గిద్దలూరులో వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో మీనాక్షి అలంకరణలో అమ్మవారు


జయలక్ష్మి అలంకారంలో అమ్మవారు


వెండిపుష్పాలతో ముద్దసానమ్మకు పూజలు


పొదిలి: ధనలక్ష్మి అలంకరణలో అమ్మవారు


తర్లుపాడు: లలిత త్రిపురసుందరీదేవీ అలంకారం

పంట కోత ప్రయోగాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న డీఎస్‌ఓ చెంచిరెడ్డి, పక్కన ఏడీఏ

మార్కాపురం టౌన్:

మార్కాపురం సబ్‌డివిజన్ పరిధిలో పనిచేసే వ్యవసాయ అధికారులు, సిబ్బందికి పంటకోత ప్రయోగాలపై పూర్తిస్థాయిలో అవగాహన అవసరమని డివిజనల్ గణాంకాధికారి చెంచిరెడ్డి అన్నారు. శనివారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో మార్కాపురం, తర్లుపాడు, కంభం, అర్ధవీడు, పెద్దారవీడు మండలాల వ్యవసాయ, ఉద్యానశాఖ ఏఓలు, సిబ్బంది అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇన్సూరెన్స్ చాలా ప్రాముఖ్యత వహిస్తుందన్నారు. ఐదేళ్ల డేటా తీసుకొని యావరేజ్‌గా దిగుబడి ఎంత వచ్చిందో చూసుకొని వేయాలన్నారు. ఏడీఏ బాలాజీనాయక్ మాట్లాడుతూ ప్రతి గ్రామ, వ్యవసాయ, ఉద్యాన సహాయకుడు పంట కోత సమయంలో క్రాప్ కటింగ్ ఎక్సిపీరిమెంట్ యాప్‌లో ఇచ్చిన అన్నీ కాలమ్స్ భర్తీ చేయాలన్నారు. ఈ-పంట నమోదును త్వరగా చేయాలని చెప్పారు. ఏఓలు బుజ్జీబాయి, జ్యోత్స్నాదేవి, శివగంగ ప్రసాద్, ప్రసన్న రంగలక్ష్మి పాల్గొన్నారు.

కోలాహలంగా కంభం చెరువు


చెరువు మెట్ల వద్ద సందర్శకుల కోలాహలం


చిన్నకంభం తూము వద్ద షార్ట్‌ఫిల్మ్ షూటింగ్

కంభం: చారిత్రాత్మక కంభం చెరువు జలకళ సంతరించుకోవడంతో సందర్శకుల తాకిడి పెరిగింది. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులో నీటి మట్టం 11 అడుగులకు చేరింది. దసరా సెలవులు కావడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి, పండుగకు సొంతూర్లకు వచ్చిన వారు సరదాగా కుటుంబంతో కలసి చెరువుకట్టకు వచ్చి సాయంత్రం వరకు గడిపి వెళ్తున్నారు. కట్ట పరిసరాల్లో, చెరువు మెట్ల వద్ద, తూముల వద్ద తిరుగుతూ సరదాగా సెల్ఫీలు తీసుకుంటూ గడుపుతున్నారు. శనివారం కంభం చెరువుకట్టపై ఓ షార్ట్ ఫిల్మ్ షూటింగ్ జరుగుతుండటంతో కట్టపైకి వచ్చిన సందర్శకులు ఆసక్తిగా తిలకించారు. కంభం చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని సందర్శకులు కోరుతున్నారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు


శ్రీవారిని దర్శించుకుంటున్న భక్తులు

కొనకనమిట్ల: మండలంలో ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. నమో వేంకటేశాయా నమో నమః అంటూ శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. ఆలయ అర్చకులు సింహాద్రిచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోవిందా..గోవిందా అంటూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకలు విజయకాంత్‌శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి వార్లను వెండి కిరీటాలతో, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కొనకనమిట్ల రామదూత క్షేత్రం వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వెంకటరామకృష్ణాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

టిడ్కో సముదాయంలో మౌలిక వసతులు కల్పిస్తాం

సాక్షి ఎఫెక్ట్..

మార్కాపురం: టిడ్కో సముదాయాల్లో మౌలిక వసతులు కల్పిస్తామని ఏపీ టిడ్కో ఒంగోలు కార్యనిర్వాహక ఇంజనీర్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 26న సాక్షిలో 'గృహయోగం ఎప్పుడో... కూటమి గ్రహణం వీడేదెన్నడో..' శీర్షికన టిడ్కో ఇళ్ల నిర్మాణంలో జరుగుతున్న జాప్యం, కనీస వసతులు ఏర్పాటు చేయని విషయాన్ని ప్రచురించారు. ఇందుకు సంబంధించి టిడ్కో కార్యనిర్వాహక ఇంజనీర్ టిడ్కో లేఅవుట్‌కు సంబంధించి వివిధ రకాల మౌలిక వసతుల పనులు జరుగుతున్నట్లు తెలిపారు. మార్కాపురం మున్సిపల్ పరిధిలో 912 గృహాలకు మౌలిక సదుపాయాల కల్పనకు అంతర్గత సిమెంటు రోడ్లు, కాలువలు, కల్వర్టులు, నీటి రిజర్వాయరు, అంతర్గత మంచినీటి సరఫరా, మురుగునీటి పైపులైన్లు, ట్రంకులైన్, మంచినీటి సరఫరా, సైట్ చదును చేసేందుకు ప్రభుత్వం రూ.6.51 కోట్లకు టెండరు పిలిచినట్లు స్పష్టం చేశారు.